అర్ధాకలి చదువులు !

- ఇంటర్ కాలేజీల్లో అమలుకాని మధ్యాహ్న భోజన పథకం
- ఆకలితో అలమటిస్తున్న విద్యార్థులు
- పథకం అమలైతే 1200 మంది విద్యార్థులకు లబ్ధి


హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల

హాలియా : ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు కలగా మారింది. ఏళ్లు గడుస్తున్నా జూనియర్ కళాశాలల్లో పథకం అమలుకు నోచుకోవడం లేదు. ఇంటర్ కాలేజీల్లో పథకాన్ని ప్రవేశపెట్టాలని గత ప్రభుత్వంలోని మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కానీ ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో పథకం అమలు నిలిచిపోయింది. దీంతో దూర ప్రాంతాల నుంచి కాలేజీలకు వచ్చే విద్యార్థులు ఆకలితో అలమటి స్తున్నారు.

పథకం అమలైతే..

నాగార్జున సాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా సాగర్, హాలియాలో రెండు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా గుర్రంపోడు, నిడమనూరు, త్రిపురారం మండలాల్లో మూడు మోడల్ (ఇంటర్మీడియట్) స్కూల్స్, ఐదు కేజీబీవీ స్కూల్స్ ఉన్నాయి. వీటిలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వివిధ గ్రూపులకు సంబంధించిన సుమారు 1200 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ విద్యా సంవత్సరంలో కళాశాల్లో విద్యార్థుల ప్రవేశాలు స్వల్పంగా తగ్గాయి.

మధ్యాహ్నమే ఇంటిదారి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా అడ్మిషన్లు తీసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో కళాశాలలకు చేరుకునేలోపు ఆలస్యం అవుతుందని కొందరు విద్యార్థులు ఉదయం తినకుండా, టిఫిన్ బాక్స్‌లు లేకుండా కాలేజీలకు వస్తున్నారు. దీంతో మధ్యాహ్న సమయంలో ఆకలితో అలమటిస్తున్నారు. కొందరు మధ్యాహ్నమే ఇంటి దారి పట్టడం ..మరికొందరు బయట దొరికే జంక్‌పుడ్ తింటూ ఇబ్బందులు పడుతున్నారు. దీని ప్రభావం ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల హాజరు, ప్రవేశాలపై పడుతోంది.

‘మధ్యాహ్న’ పథకం అమలు చేయాలి



ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసి గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుకు దూరం కాకుండా చూడాలి. గత ప్రభుత్వ హయాంలో మంత్రివర్గం సానుకూలంగా నిర్ణయం తీసుకున్నా అమలుకు నోచుకోలేదు. కొత్త ప్రభుత్వం సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి పేద విద్యార్థులను ఆదుకోవాలి.

– ఉదయ్, విద్యార్థి, సీఈసీ, సెకండ్ ఇయర్, హాలియా

క్లుప్తంగా

22 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

- సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్

మిర్యాలగూడ: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 22 సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం పొడవైన పత్తి పింజ రకానికి క్వింటాల్‌కు రూ.7,521, మధ్యస్థ పింజ రకానికి రూ.7,121 మద్దతు ధర అందిస్తుందని పేర్కొన్నారు. పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోకుండా సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

భూ కబ్జాదారులపై చర్య తీసుకోవాలని వినతి

మిర్యాలగూడ : ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ దామరచర్లకు చెందిన బెజ్జం సాయి మంగళవారం సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న నాయకులు ప్రభుత్వ భూముల వద్ద వెంచర్లు భూ కబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. దామరచర్లతో పాటు మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో కూడా ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు.

ఐరన్ గ్రిల్స్ ధ్వంసం

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి పంచాయతీ సమీపంలోని కోదాడ – జడ్చర్ల 167వ జాతీయ రహదారిపై ఫుట్ బోర్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్స్‌ను సోమవారం రాత్రి దుండగులు ధ్వంసం చేశారు. ధ్వంసమైన గ్రిల్స్‌తో సుమారు రూ.1.25లక్షల నష్టం వాటిల్లినట్లు హైవే అధికారులు తెలిపారు. ఈ విషయమై మంగళవారం కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

మాజీ సర్పంచ్‌కు స్నేవారత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న నరేందర్

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని పెద్దగట్టు మాజీ సర్పంచ్ నరేందర్‌కు సేవారత్న అవార్డు దక్కింది. సర్పంచ్‌గా నరేందర్ చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాల గుర్తింపుగా తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ వారు అందించే మహాత్మా గాంధీ శాంతి పురస్కారాన్ని మంగళవారం హైదరాబాద్‌లో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్, రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ చంద్రకుమార్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తదితరులున్నారు.

ఎరువుల దుకాణం ఎదుట ధర్నా

మిర్యాలగూడ: నకిలీ పురుగు మందులు విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని ఫర్టిలైజర్ షాపు ఎదుట ఆందోళనకు దిగారు. దామరచర్ల మండలం దిలావర్‌పూర్ శివారులో మూడు ఎకరాల వ్యవసాయ భూమిలో దోమ, ఆకు చుట్టు, పొట్టు కుల్లుడు వైరస్ సోకిందని పట్టణంలోని సాగర్ రోడ్డులో ఉన్న హనుమాన్ ఫర్టిలైజర్ షాపును ఆశ్రయించగా సుమారు రూ.15వేల విలువ చేసే పురుగు మందులను ఇచ్చారని తెలిపారు. దానిని తీసుకెళ్లి పొలానికి పిచికారీ చేస్తే వరి పంట మరింత నష్టం వాటిల్లిందని వాపోయారు. షాపు యజమానిని నిలదీయగా తప్పు జరిగిందని, మరో రకం మందులు ఇచ్చారని, దానిని తీసుకెళ్లి పిచికారీ చేస్తే పంట ఎర్రగాబారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఫిర్యాదు అందిందని విచారణ జరుపుతామని ఏఓ సైదానాయక్ తెలిపారు.

జీఓ 29ని రద్దు చేయాలి

త్రిపురారం : ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నష్టం కలిగించే ఈడబ్ల్యూఎస్, జీఓ 29ని ప్రభుత్వం రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రాక్షి నర్సింహ డిమాండ్ చేశారు. నిడమనూరు మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్, జీఓ నంబర్ 29 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉద్యోగ నియామకాల్లో అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు జన్నపాల రమేష్, వెంకటయ్య, శంకర్ ఉన్నారు.

కుమారుడికి తలకొరివి పెట్టిన తల్లి

మిర్యాలగూడ టౌన్ : కుమారుడికి తల్లి తలకొరివి పెట్టిన ఘటన మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని బంగారుగడ్డకు చెందిన రేణికుంట్ల విజయ్(45) స్థానికంగా కుట్టుమిషన్ దుకాణంలో పనిచేస్తూ తల్లిని సాకుతున్నాడు. సోమవారం రాత్రి విజయ్ గుండెపోటుతో మృతిచెందాడు. ఇతడికి వివాహం కాకపోవడంతో తల్లి రేణికుంట్ల రాములమ్మ 85 ఏళ్ల వయసులో కుమారుడికి తలకొరివి పెట్టడం పలువురిని కలచివేసింది. అవసాన దశలో ఒంటరిని చేసి వెళ్లిపోయావా కొడుకా అంటూ ఆమె రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు బాగుంది


చిన్నారులతో ముచ్చటిస్తున్న బృందం సభ్యులు


రామన్నగూడెంలో పండ్లతోటలను పరిశీలిస్తూ..

- సివిల్ సర్వీస్ ప్రొబేషనరీ అధికారుల బృందం కితాబు

చింతపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు ఎంతో బాగుందని ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ప్రొబేషనరీ అధికారుల బృందం కితాబు ఇచ్చింది. సివిల్ సర్వీస్ ప్రొబేషనరీ అధికారుల బృందం మంగళవారం చింతపల్లి మండలంలోని జర్పులతండాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు చిన్నారుల పెరుగుదల, ఆరోగ్య లక్ష్మి పథకం, ప్రీ స్కూల్ నిర్వహణ పద్ధతులను ఐసీడీఎస్ సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో సదుపాయాల కల్పనను పరిశీలించి సంతృప్తివ్యక్తం చేశారు. అనంతరం బృందం సభ్యులు సుమన్ నాలా (ఐపీఎస్) డి.కుడియారసు (ఐపీఎస్) దిగ్విజయ్ సింగ్ (ఐడీఈఎస్) నివేదన్ (ఐఎఫ్ఓఎస్) పూర్ణిమ సుడెన్ (ఐఈఎస్) చిన్నారులతో ముచ్చటించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్‌సూపర్‌వైజర్ పార్వతి, పంచాయతీ కార్యదర్శి కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

రంగారెడ్డిగూడెంలో..

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని రంగారెడ్డిగూడెంలో మంగళవారం ఆల్‌ఇండియా సివిల్ సర్వీస్ ప్రొబేషనరీ అధికారుల బృందం పర్యటించింది.ఈ సందర్భంగా వారు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. గ్రామంలోని వీధుల గుండా తిరుగుతూ ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. అనంతరం పండ్లతోటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆల్‌ఇండియా సర్వీస్ అధికారుల బృందం సభ్యులు పాయల్ మీనా,రష్మి,అభిషేక్ రంజన్,కునాల్ గురురాని,అఘుతోష్ సాటి,ఎంపీడీవో చంద్రమౌళి తదితరులున్నారు.

అయోడిన్ లోపంలో జీవక్రియ గతి తప్పుతుంది

మిర్యాలగూడ అర్బన్ : అయోడిన్ లోపంతో జీవక్రియలు గతి తప్పుతాయని హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ప్రపంచ అయోడిన్ డిఫెషియన్సీ డిజార్డర్స్ ప్రివియంటేషన్ డే లో భాగంగా పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం అయోడిన్ లోపం వలన కలిగే రుగ్మతల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.విజయకుమారి, ఉపాధ్యాయులు నాగరాణి, పార్వతి, హెల్త్ సూపర్‌వైజర్లు ఉన్నారు.

ఆకతాయిలపై కేసు

నాగార్జునసాగర్: అర్ధరాత్రి మద్యం మత్తులో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఆకతాయిలపై విజయపురిటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. హిల్‌కాలనీలో నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న చెన్నయ్య సోమవారం అర్ధరాత్రి దాటాక ఓవర్‌హెడ్ ట్యాంకులు నింపేందుకు వెళ్తుండగా కొండపై గల వీధికి చెందిన హర్ష, శివసాయి, మల్లేష్‌లు మద్యం తాగి విధులకు ఆటంక పరిచారని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంపత్‌గౌడ్ తెలిపారు.

కారు, ఆటో ఢీ.. కూలీలకు గాయాలు

త్రిపురారం: కారు, ఆటో ఢీకొని కూలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం నిడమనూరు మండలం నర్సింహులగూడెం వద్ద జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన కూలీలు అనుముల మండలం పాలెం వద్ద పత్తి ఏరేందుకు ఆటోలో వెళ్తున్నారు. ఆటో నిడమనూరు మండలం నర్సింహులగూడెం వద్దకు చేరుకోగానే ఎదురుగా శాఖాపురం రోడ్డు నుంచి కారు వచ్చింది. ఆటో ఆగుతుందని కారు, కారు ఆగుతుందని ఆటో నడిపే డ్రైవర్లు అజాగ్రత్తగా ఉండడంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన తవుడబోయిన సాయమ్మ, కాట్నం జ్యోతి, టాకూర్ శైలజ, దుండిగళ్ల జయమ్మ, మల్లె సునీతకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి క్షతగాత్రులను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

26న మాజీ ఎమ్మెల్యే విగ్రహం ఆవిష్కరణ

హాలియా : త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో ఈనెల 26న చలకుర్తి మాజీ ఎమ్మెల్యే గుండెబోయిన రామ్మూర్తి యాదవ్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ఆయన తనయులు గుండెబోయిన కోటేష్ యాదవ్, గుండెబోయిన నగేష్ యాదవ్ తెలిపారు. మంగళవారం హాలియాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సాగర్ నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి యాదవ్ ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రావుల శ్రీనివాస్ యాదవ్ తదితరులున్నారు.

విజయవంతం చేయాలి

త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామపంచాయతీ సమీపంలో ఈ నెల 26న నిర్వహించనున్న చలకుర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గుండెబోయిన రామ్మూర్తి యాదవ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కుమారులు గుండెబోయిన కోటేష్ యాదవ్, గుండెబోయిన నగేష్ యాదవ్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం వారు స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమానికి మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.

పీఎంకు ఈ మెయిల్ ద్వారా లేఖ

మిర్యాలగూడ టౌన్ : బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని కోరుతూ పీఎం నరేంద్ర మోదీకి ఈ మెయిల్ ద్వారా మంగళవారం లేఖ పంపించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు.

ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించాలి

- ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న డీఈఈ వెంకట్‌రెడ్డి

మిర్యాగూడ: ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించేలా గ్రామ మంచినీటి సహాయకులు కృషి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వెంకట్‌రెడ్డి కోరారు. మంగళవారం దామరచర్ల మండల కేంద్రంలోని రైతువేదికలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాలకు చెందిన గ్రామ మంచినీటి సహాయకులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు మంచినీటిని అందించడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. నీటి వృథాను అరికట్టి, ప్రతి ఇంటికి శుద్ధమైన మంచినీటిని అందించాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించి పరీక్షించాలన్నారు. తాగునీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూసుకోవాలని, చేతి పంపులకు మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మూర్తి, వెంకటేశ్వర్లు, ఏఈలు చిన్నినాయక్, దినేష్, సింధు, సుష్మిత, ల్యాబ్ సిబ్బంది, నీటి సహాయకులు, మిషన్ భగీరథ హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా పత్తి కొనుగోలు చేయాలి

దేవరకొండ : సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఆంక్షలు లేకుండా రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన ప్రజా సంఘాల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు పెట్టుబడి సహాయం అందజేయాలని కోరారు. అర్హులైన రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకటరమణ, మైనొద్దీన్, బుచ్చిరెడ్డి, కనకాచారి, శైలేష్, రామస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల నిరసన

చింతపల్లి: పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని వెంకటేశ్వరనగర్, చింతపల్లి జెడ్పీహెచ్‌ఎస్, గడియగౌరారం యూపీఎస్‌లలో మంగళవారం మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తపస్ మండల అధ్యక్షుడు సొనగంటి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి శివకోటి కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సినడీఏలు, ఏరియర్స్ పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పీఆర్‌సీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వినోద్,నెలంటి వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించేంత వరకు ఉద్యమం


సమావేశంలో పాల్గొన్న బీసీ జేఏసీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : బీసీలకు చట్టసభల్లో 50శాతానికి పైగా రిజర్వేషన్లు కల్పించేంత వరకు ఉద్యమించాలని బీసీ జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం ఎన్‌ఎస్‌పీ క్యాంపులో గల మహాత్మా జ్యోతిరావ్‌పూలే బీసీ భవనంలో జరిగిన సన్నాహక సమావేశంలో పలువురు బీసీ జేఏసీ నాయకులు పాల్గొని మాట్లాడారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు మారం శ్రీనివాస్, తమ్మడబోయిన అర్జున్, కోల సైదులు, సోములు, పాదిల శ్రీనివాస్, బంటు సైదులు, మురళి, జాలకంటి సత్యం, రాములు, ఈశ్వరాచారి, వేణు తదితరులున్నారు.

సబ్ మార్కెట్ యార్డులో వసతుల కల్పనకు కృషి


మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

పెద్దవూర: పెద్దవూర సబ్ మార్కెట్ యార్డులో మిగిలిన పనులను పూర్తి చేసి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పెద్దవూర మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డును అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకువచ్చే రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. రైతులు పండించిన ప్రతి వరిగింజనూ ప్రభుత్వం రూ.500ల బోనస్‌తో కొనుగోలు చేస్తుందని తెలిపారు. అనంతరం ఎస్ఎంసీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మండల కేంద్రానికి వచ్చిన ఆయనకు గ్రామస్తులు, రైతులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ఊరె వెంకన్న, సీఈఓ వద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్, నాయకులు కాటేపల్లి వెంకటయ్య, కోట అంజి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్


చిన్నఅడిశర్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి : మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ హెచ్చరించారు. కొండమల్లేపల్లి మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. దీపావళి తర్వాత రాష్ట్రంలో మరో నాలుగు లక్షల మందికి ప్రభుత్వం రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మార్కెట్‌కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, నాయకులు సిరాజ్‌ఖాన్, ఉట్కూరి వేమన్‌రెడ్డి, మేకల శ్రీనివాస్‌యాదవ్, కొట్ల జగదీష్, బొడ్డుపల్లి సైదులు, కొర్ర రాంసింగ్‌నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్లు, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, ఏఓ జానకిరాం, సీఈఓ తిరుపతిరెడ్డి, ఎంపీడీఓ బాలరాజురెడ్డి, మార్కెట్ కమిటీ సెక్రెటరీ కిరణ్, ఏఈఓ సురేష్, మల్లేష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెద్దఅడిశర్లపల్లి : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మణిపాల్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ నాయిని జమునామాధవరెడ్డి, పీఏసీఎస్ సీఈఓ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

దేవరకొండ : నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జమునామాధవరెడ్డి, పల్లా నర్సింహారెడ్డి, వేణుధర్ రెడ్డి ,పున్న వెంకటేశ్వర్లు, జానీయాదవ్, సర్వయ్య , శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి


ఏకేబీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి : ఏకేబీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అధికారులకు ఆదేశించారు. మండలంలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వెనుక జలాల వద్ద ఏర్పాటు చేస్తున్న ఏకేబీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు.అనంతరం ఆయన లిఫ్ట్ పనుల పురోగతులపై ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాదిలోగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్మార్పీ డీఈ నాగయ్య,కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాన్, మాధవరెడ్డి, మణిపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి,ఎల్లయ్య, బోడ్యానాయక్, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజుల ఆధారంగానే భూమి కొనుగోలు

- మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ భార్గవ్


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్

మిర్యాలగూడ: దస్తావేజుల ఆధారంగానే పట్టణంలోని సాగర్‌రోడ్డులో సర్వే నెం.992లో 1540గజాల స్థలాన్ని కొనుగోలు చేశామని మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ తెలిపారు. కావాలనే కొందరు రాజకీయ దురుద్దేశంతో తమపై విష ప్రచారం చేస్తున్నారని వాపోయారు. మంగళవారం సాయంత్రం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1990లో దాచిరెడ్డి రుక్మిణిదేవి వీలునామా ప్రకారం వారి వారసులైన కుందూరు హర్షవర్ధన్‌రెడ్డి, విజయలక్ష్మి, రాణిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, భిక్షంరెడ్డిల ద్వారా 2019లో 9 మంది భాగస్వామ్యంతో ఆ స్థలాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. 1977– 78 సంవత్సరంలో మొత్తం 8.30 ఎకరాలకు పహాణీలో ఆబాది ఉందని, మున్సిపల్ అధికారులు కేవలం 1540 గజాలకు మాత్రమే నోటీసు ఇచ్చారని తెలిపారు. భూమిని కబ్జా చేసిన విషయం అవాస్తవమన్నారు. సమావేశంలో మన్నెం లింగారెడ్డి, సైదిరెడ్డి, గోవింద్‌రెడ్డి, మలగం రమేష్, సత్యం పాల్గొన్నారు.

కొమురం భీమ్ గొప్ప పోరాటయోధుడు


కొమురంభీమ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, బీసీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ఆదివాసుల హక్కుల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిన కొమురంభీమ్ గొప్ప పోరాట యోధుడని మిర్యాలగూడ పట్టణంలోని నేతాజీ హైస్కూల్ కరస్పాండెంట్ శ్రీపతి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని హౌజింగ్ బోర్డులో గల నేతాజీ హైస్కూల్‌లో కొమురంభీమ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడంతో పాటు నిత్యం ప్రజా సేవలకే అంకితమైన కొమురంభీమ్ స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు మురళి యాదవ్, సిరిశాల యాదయ్య, కేపీ రాజు, ఉపాధ్యాయులు బీమ్లానాయక్, అలివేలు,. సునిత, కళ్యాణి, జబీన్, నందిని, శోభ, సైదమ్మ తదితరులున్నారు.

చేనేత ఐక్య వేదిక సలహా మండలి చైర్మన్‌గా ‘కొంగరి’


కొంగరి నారాయణ


జి.లక్ష్మీనారాయణ

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ చేనేత ఐక్య వేదిక సలహా మండలి చైర్మన్‌గా పట్టణంలోని నందిపాడుకు చెందిన కొంగరి నారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.లక్ష్మీనారాయణను నియమిస్తూ మంగళవారం ఆ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. కొంగరి నారాయణ ఫైవ్‌మెన్ కమిటీకి సలహా మండలి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర కమిటీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా, పట్టణ, మండల కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎఫ్‌సీఐ హమాలీ కార్మికులకు అన్యాయం చేయొద్దు


మాట్లాడుతున్న హమాలీ కార్మికులు

మిర్యాలగూడ అర్బన్: ఎఫ్‌సీఐలో పనిచేసే నాన్ డీపీఎస్ కార్మికులకు అన్యాయం చేయవద్దని కార్మికులు విజయ్, శంకర్‌రావు, రామారావు, భిక్షంరెడ్డి, మౌలా కోరారు. మంగళవారం ఎఫ్‌సీఐలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎఫ్‌సీఐలో పనిచేసే సుమారు 500 మంది కార్మికులు సొసైటీగా ఏర్పడి హమాలీ పనిచేసుకుంటూ ఉపాధి పొందుతున్నామని తెలిపారు. 2003 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం 260 మందిని డీపీఎస్ కింద తీసుకుందని తెలిపారు. ఆనాడు అందరి సమక్షంలో జరిగిన ఒప్పందం ప్రకారం కార్మికుల సహకారంతో కొనుగోలు చేసిన భూమిని నాన్ డీపీఎస్ కార్మికులకు ఇవ్వాలని నిర్ణయించారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న డీపీఎస్ కార్మికులను బదిలీలో భాగంగా ఇటీవల చర్లపల్లి ఎఫ్‌సీఐకు బదిలీ చేశారని, అక్కడ విధులు నిర్వహించేందుకు ఇష్టంలేని డీపీఎస్ కార్మికులు నాన్ డీపీఎస్‌కు ఇచ్చిన భూమిపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కార్మికులు కొనుగోలు చేసిన ఆ భూమిపై డీపీఎస్ కార్మికులకు ఎలాంటి హక్కు లేదన్నారు. సొసైటీ కింద డబ్బులు కాజేసినట్లు ఆరోపణలు చేయడం సరైందికాదన్నారు. కార్యక్రమంలో శంకర్, రవి, చిన్న, చందర్, బాలకృష్ణ, శత్రు, దీప్లా, బిల్లు, బుజ్జమ్మ, నాగమణి, సైదమ్మ పాల్గొన్నారు.

పార్టీ అభ్యున్నతికి పాటుపడే వారికే ప్రాధాన్యం

మిర్యాలగూడ : పార్టీ అభ్యున్నతికి పాటు పడే వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం ఇస్తామని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వనం మదన్మోహన్ తెలిపారు. మంగళవారం దామరచర్ల మండలం తాళ్లవీరప్పగూడెంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. లక్ష్యం మేరకు ప్రతి కార్యకర్త సభ్యత్వాలను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో చిలుకూరు సైదులు, కూరాకుల రవీందర్, పెండెం సైదులు, కృష్ణంరాజు, రవికుమార్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

దేవరకొండ : బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారపు రమేష్ కోరారు. ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం దేవరకొండ పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాలునాయక్, పిట్టల శ్రీనివాస్, అంకూరి నర్సింహ, నేతాల వెంకటేష్‌యాదవ్, నారాయణరావు, చండీశ్వర్, భాస్కర్, నాగేంద్ర తదితరులున్నారు.